
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం ၊ 5 ၊ సెప్టెంబర్ ၊ 2023



వర్సిటీ అభివృద్ధికి సమష్టి కృషి

తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన ఆదికవి నన్నయ యూనివర్సిటీని ప్రగతి పథంలో నడిపించడానికి సమష్టి కృషి అవసరమని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. - IIలో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం గోదావరి తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

నిత్యాన్నదాన భవనానికి విరాళాలు



ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి యడ్ల పార్థసారథి దంపతులు (విజయవాడ) రూ.1,07,001, ఆచంట విజయ నరేష్ దంపతులు (పెన్నాడ) రూ.1,00,116 చొప్పున సోమవారం విరాళాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

స్వామివారి సన్నిధిలో జస్టిస్ శివశంకర్‌రావు



అంతర్వేది ఆలయంలో జస్టిస్ శివశంకర్‌రావు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం రాష్ట్ర జ్యుడీషియల్ రివ్యూ కమిటీ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ బులుసు శివశంకర్‌రావు కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు జస్టిస్ శివశంకర్‌రావు, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ఆయనకు అందజేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాపు కల్యాణ మంటపానికి రూ.లక్ష విరాళం



ప్రభాకరరావుకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

ఆలమూరు: స్థానిక భువనేశ్వరి చెరువు గట్టు వద్ద నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మంటపం తుది పనులకు హైదరాబాద్‌లో నివాసముంటున్న గ్రామానికి చెందిన పోడూరి అయ్యప్ప కుమార్, రవితేజ రూ.లక్ష విరాళాన్ని అందించారు. గ్రామంలో భారీ స్థాయిలో కాపు కల్యాణ మంటపాన్ని నిర్మిస్తున్నారని సోషల్ మీడియాలో తెలుసుకున్న ఆ సోదరులు తమ తాత శ్రీపతి సత్యనారాయణ జ్ఞాపకార్థం ప్రకటించిన విరాళాన్ని శ్రీకృష్ణదేవరాయ మండల కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావుకు సోమవారం అందజేశారు. శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు రామానుజుల శేషగిరిరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు చల్లా నానాజీ, కోశాధికారి. సిరిగినేటి పట్టాభి, ఉండమట్ల బూరయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని పెనికేరుకు చెందిన సుమారు 300 మంది టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు సోమవారం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు జుత్తుక శ్రీనివాసు, సర్పంచ్ వనుం చిన్నావతి, ఎంపీటీసీ యనమదల స్వాతి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాసు నేతృత్వంలో కార్యకర్తలు ర్యాలీగా గోపాలపురంలోని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నివాసానికి తరలివెళ్లారు. వారందరికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో యాండ్ర సత్యనారాయణ, గుత్తుల గోవిందు, గెద్దాడ సత్యనారాయణ, కె.రమేష్, కానుమోను శ్రీను, గుత్తుల వెంకట్రావు, గుత్తుల రమేష్ తదితరులు ఉన్నారు.

పశుసంవర్ధక శాఖ జేడీగా వెంకట్రావు



అమలాపురం రూరల్: జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా (జేడీ) కొమ్మా వెంకట్రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈదరపల్లిలో ఆయన కార్యాలయంలో ఇన్‌చార్జి జేడీ కర్నీడీ మూర్తి నుంచి బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా చింతలదేవి, లైవ్‌స్టాక్ ఫార్మ్ నుంచి పదోన్నతిపై కోనసీమ జిల్లాకు వచ్చారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా రాజేశ్వరి

తొండంగి: మండలంలోని వాకదారిపేట కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ) ప్రిన్సిపాల్ ఎం.రాజేశ్వరి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. ఎంఈఓ షేక్ బాబ్జీ సోమవారం ఈ విషయం తెలిపారు.

> గురువు, దైవం ఇద్దరూ ఒకేసారి కనిపిస్తే నేను గురువుకే ముందుగా నమస్కరిస్తాను.
> - కబీర్‌దాస్

> గురువంటే పసిపిల్లల పెదాలపై విరిసిన నవ్వురేఖ
> - డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

> తల్లి జన్మనిస్తుంది..గురువు జీవితాన్నిస్తాడు.
> - ప్రధాని నరేంద్రమోదీ

గురుభ్యో నమః

- నేడు ఉపాధ్యాయ దినోత్సవం
- నేడు ముమ్మిడివరంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

రాయవరం:

'గురుబ్రహ్మ గురుర్విష్ణు గురుదేవో మహేశ్వరః గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః' గురువు దేవుడితో సమానమని దీనర్థం. అజ్ఞానపు చీకట్లను తొలగించి జ్ఞాన జ్యోతులు ప్రసాదించే దైవం గురువు. ఆది యుగం నుంచి ఆధునియగం వరకు సమాజంలో గురువు ప్రాధాన్యం తగ్గలేదు. పురాణేతిహాస కాలంలో భగవంతుడిగా కొలిచే రాముడికి వశిష్టుడు, శ్రీకృష్ణుడికి సాందీపుడు గురువులుగా వ్యవహరించగా, కౌరవులు, పాండవులకు ద్రోణాచార్యుడు, దేవతలకు బృహస్పతి, రాక్షసులకు శుక్రాచార్యుడు గురువుగా ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోంది. ఉపాధ్యాయులు బోధనా పటిమను పెంపొందించుకునేందుకు వారికి వృత్యంతర శిక్షణను అందజేస్తోంది. ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 142 పాఠశాలల్లో 950 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. డిజిటల్ విద్యలో బోధన చేసేందుకు అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ బోధనా విధానాన్ని కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకుని వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనలో దేశానికే రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోంది. మీ పిల్లలను మా స్కూల్స్‌లో చేర్పించండి అంటూ ఉపాధ్యాయులు పిలుపునివ్వడమే కాదు. అనేక మంది ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చేర్పించి ఆచరణలోనూ చూపించారు. ఆదర్శంగా నిలిచారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో 6,587 మంది ఉపాధ్యాయులున్నారు.

34 మంది ఎంపిక

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు ముమ్మిడివరంలోని ఎయిమ్స్ కళాశాల సమావేశపు హాలులో నిర్వహించనున్నారు. ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేయనున్నారు. జిల్లాలో 34 మంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు.

గురువు స్థానం పదిలం



సమాజంలో నాటికి నేటికి గురువు స్థానం ఎప్పుడూ పదిలమే. తొలి గురువు తల్లి అయితే ఆ తర్వాత స్థానం ఉపాధ్యాయుడిదే. పాఠశాల స్థాయిలో నాపై సోషల్ టీచర్ సరోజిని ప్రభావం ఎక్కువ ఉండేది.

- ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



మ్యాజిక్ టీచర్



ఆత్రేయపురం: వాడపల్లి మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న చింతా శ్యామ్‌కుమార్ మ్యాజిక్ మాస్టార్‌గా పేరు తెచ్చుకున్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన ఆయన ప్రవృత్తిగా మ్యాజిక్, డ్రాయింగ్, డాన్స్, గ్రామీణ కళలు, మిమిక్రీ, టాకింగ్ డాల్, సింగింగ్, సంగీతం, అక్షర చిత్రకళ అంశాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇంత వరకు 20 దేశాల విద్యార్థులు తన సేవలు వినియోగించుకున్నారన్నారు. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ప్రత్యేక మ్యాజిక్ ప్రదర్శనలు నిర్వహించి వచ్చిన మొత్తాన్ని బాధితులకు ఖర్చు చేస్తుంటారు. ఈయనకు యునిసెఫ్ నుంచి రెండుసార్లు ఉత్తమ టీచర్‌గా అవార్డులు వచ్చాయి. గోదావరి, కృష్ణా పుష్కరాల్లో పురస్కారాలు లభించాయి. సాహస పుత్ర, ఆంధ్ర పీసీ సర్కార్, మ్యాజిక్ మెగాస్టార్, ఉపాధ్యాయ రత్న, జీవిత సాఫల్య పురస్కారాలను అందుకున్నారు.

విద్యార్థుల హాజరు పెంచిన ఏకోపాధ్యాయుడు



అభ్యసన సామగ్రితో బోధిస్తున్న రవికుమార్

కొత్తపేట: మోడేకుర్రు పంచాయతీ శివారు గ్రామం సంజీవనగర్. అక్కడ ఏకోపాధ్యాయ పాఠశాలలో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్న పరిస్థితుల్లో 2017–18 విద్యాసంవత్సరం ఆ స్కూలులో కేవలం 9 మంది విద్యార్థులు మాత్రమే చదివారు. ఆ ఏడాది ఆ పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు కె.రవికుమార్‌కు వృత్తి పట్ల, విద్యా బోధనపై ఉన్న చిత్తశుద్ధి, కార్పొరేట్ తరహాలో విద్యా బోధన ఆ ప్రాంత విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకుంది. ఫలితంగా ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో 24 మంది విద్యార్థులు ఉన్నారు. రవికుమార్ అభ్యసన సామగ్రిని సొంతంగా తయారు చేసి విశ్లేషించి బోధించడం, విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సహించడం, పరీక్షలు, ఆటలు, పాటలు, డ్రాయింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం వంటివి చేస్తూ విద్యార్థులను పాఠశాలకు రప్పించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

యూట్యూబ్, టీఎల్‌ఎంలతో వినూత్న బోధన



సొంతంగా తయారు చేసిన టీఎల్‌ఎంలతో రత్నం మేడమ్, విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న శ్రీకాకుళపు వెంకట సత్య సూర్య జానకి భాగ్యలక్ష్మి రత్నం (రత్నం మేడమ్) 2018 నుంచి యూట్యూబ్‌లో పాఠాలను టీఎల్‌ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) సహకారంతో తయారు చేసి బోధిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని టీఎల్‌ఎంలు తయారు చేయడం, వాటి ద్వారా విద్యాబోధన చేయడం ప్రారంభించారు. దాని నుంచి మంచి ఫలితాలు రావడంతో ఇతర ఉపాధ్యాయులూ దాని అనుసరించి వాటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు 151 వీడియోలను ఆమె అప్‌లోడ్ చేశారు. గత ఏడాది ప్రభుత్వం ప్రారంభించిన టర్ల్ (టీచింగ్ ఎట్ రైట్ లెవెల్) ప్రోగ్రాంపై కూడా ఆమె పాఠాలను రూపొందించి అప్‌లోడ్ చేశారు. ఆమె యూట్యూబ్ పాఠాలను 21,600 మంది సబ్‌స్క్రైబ్ చేసి ఫాలో అవుతున్నారు. సెప్టెంబర్ 3వ తేదీ నాటికి 35,63,095 మంది వీక్షించారు.

'సెంటా' అవార్డుకు జిల్లా నుంచి ఐదుగురు ఉపాధ్యాయుల ఎంపిక

రాయవరం: రాష్ట్ర విద్యా పరిశోధక మండలి నిర్వహించిన సెంటా పరీక్షలో జిల్లా నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఇంగ్లిషులో భాషా ప్రావీణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ పరీక్షను నిర్వహించారు. ఈ నెల ఒకటో తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన ఐదుగురు ఉపాధ్యాయులకు 'సెంటా' అవార్డును ప్రకటించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఇంగ్లిష్ సబ్జెక్టులో కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి కొత్తపల్లి ధర్మరాజు, గణితం సబ్జెక్టు నుంచి కొత్తూరు జగన్నాథపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన చెలమకూరి విజయలక్ష్మి, ప్రాథమిక పాఠశాల విభాగంలో ఆత్రేయపురం మండలం ర్యాలి ఎంపీపీ మోడల్ ప్రైమరీ నంబర్–1 పాఠశాల నుంచి గోపిసీడి లక్ష్మీసుజాత, సైన్స్ సబ్జెక్టు నుంచి పి.గన్నవరం మండలం ముంగండ జెడ్పీహెచ్‌ఎస్ నుంచి గెద్దం సుదర్శిని, సోషల్ సబ్జెక్టు నుంచి రావులపాలెం మండలం ఈతకోట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొవ్వూరి సాయివెంకటకృష్ణారెడ్డి ఎంపికయ్యారు.

కచ్చితంగా ఓటరు జాబితా సంక్షిప్త సవరణ

అమలాపురం రూరల్: కచ్చితత్వంతో ఓటరు జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ జాబితాలో మరణాలు డూప్లికేట్, బోగస్ ఓట్ల విచారణలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలను పరిగణనలోకి తీసుకోవడంపై 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డీఆర్‌ఓలతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ఓటర్ల జాబితా నమోదులో పొరపాట్లకు తావు లేకుండా అధికారులు స్పష్టమైన నివేదిక రూపొందించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులను గుర్తించి ఓటు నమోదు చేయించాలని సూచించారు. బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి చనిపోయిన వ్యక్తులు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను సేకరించి, విచారణ చేసి నోటీసులు జారీ చేస్తూ జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఫొటో ఓటర్ గుర్తింపు కార్డులకు ఆధార్ సీడింగ్ నిర్బంధం కాదన్నారు. రీ వెరిఫికేషన్, తొలగింపుల ప్రక్రియకు సంబంధించి ఇంకా 2,000 వరకు పెండింగులో ఉన్నాయని, రాజకీయ పార్టీల, ఇతరుల ఫిర్యాదులు అన్నింటినీ పరిష్కరించామన్నారు. ప్రాథమిక స్థాయి చెకింగ్ సంబంధించి 22 బృందాలను నియమించామన్నారు.

ఇంటింటి సర్వే ప్రక్రియ నూటికి నూరు శాతం పూర్తయిందని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాలు ప్రస్తుతం 1,641 వరకు ఉన్నాయని పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌కు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ అధికారులు జీవీ సత్యవాణి, వి.శివశంకర్ ప్రసాద్, ఎస్.సుధాసాగర్, కలెక్టరేట్ ఎన్నికల ఉద్యోగి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శుక్లా, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారం

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: సంతృప్తికర స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి సుమారు 185 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గడువులోగా నాణ్యమైన సేవలందించే ఉద్దేశంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనతో పాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కూడా రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. ఈ రెండు కార్యక్రమాల నిర్వహణపై జిల్లాస్థాయి అధికారులు మరింత ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కోసం ప్రత్యేకంగా 1902 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారన్నారు. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడు తమ ఫిర్యాదుల స్థితి, పరిష్కారం గురించి తెలుసుకునే వీలుందన్నారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లతో పాటు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తుందన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరిస్తూ రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుక్లా

సీ ఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 8, 9, 10 తేదీలలో రాజమహేంద్రవరం మంజీరా మాల్ లో నిర్వహించనున్న సీఫుడ్ ఫెస్టివల్ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ శుక్లా ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ మాట్లాడుతూ జిల్లాలో మల్టీపర్పస్ సౌకర్యాల గోదాములు నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్థలాల కొరత ఉందని వివిధ శాఖల వద్ద ఖాళీగా ఉన్న స్థలాల వివరాలను కలెక్టర్ కార్యాలయానికి సమర్పించి అభివృద్ధికి సహకరించాలని ఆమె జిల్లా స్థాయి అధికారులకు సూచించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పోలీసు 'జగనన్నకు చెబుదాం'కు 28 అర్జీలు

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి 28 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు వచ్చి తమ సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. అమలాపురం పట్టణంలో గొవ్వాల వీధికి చెందిన వృద్ధ దంపతులు తమ కొడుకు వల్ల ఎదురైన సమస్యను ఎస్పీకి చెప్పుకుని విలపించారు. తమ కొడుకు క్రికెట్ బెట్టింగ్‌ల్లో అప్పుల పాలయ్యాడని, కొడుకు బాగు కోసం కొన్ని అప్పులు కూడా తీర్చామని ఎస్పీకి చెప్పుకున్నారు. అయినప్పటికీ తమ పేర ఉన్న ఆస్తిని అతని పేరున రాయాలని తమను వేధిస్తున్నాడని ఆ వృద్ధ తల్లిదండ్రులు ఎస్పీ వద్ద వాపోయారు. వీరి సమస్యపై స్పందించిన ఎస్పీ తగిన చర్యలకు సంబంధిత పోలీసు అధికారికి ఆదేశాలు జారీ చేశారు. వచ్చిన 29 అర్జీల్లో సగానికి పైగా ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలకు సంబంధించిన సమస్యలతోనే అర్జీదారులు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీకుమార్ పాల్గొన్నారు.



అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదు పత్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

పంచాయతీ చట్టాలపై అవగాహన ఉండాలి

సామర్లకోట: పంచాయతీ చట్టాలపై కార్యదర్శులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని స్థానిక విస్తరణ, శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 150 మంది పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శులుగా 20 సంవత్సరాలు మించి అనుభవం ఉన్నప్పటికీ అనేక విషయాలు తెలియకపోవడం వలన ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. నగదు చిట్టాతో పాటు ఫైల్స్ తయారీ ఎంతో కీలకమన్నారు.

దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందని చెప్పారు. గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త లే అవుట్ ఏర్పాటు, పరిపాలనా విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, జీఓలు, క్రమశిక్షణ చర్యలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని వివరించారు. కోర్సు డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ, గ్రేడ్–1, గ్రేడ్–5 కార్యదర్శులకు పంచాయతీ చట్టాలతో పాటు సాంకేతిక పద్ధతుల్లో సమస్యలు పరిష్కరించడంపై అవగాహన పెంచుతామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు, అమలుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, బి.ఆంజనేయులు, నిహారికలు శిక్షణ నిర్వహించారు.



ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సీఎం జగన్‌ను కించపరిస్తే సహించేది లేదు

లోకేష్‌కు ఎంపీ భరత్‌రామ్ హెచ్చరిక



రాజమహేంద్రవరం సిటీ: పంచాయతీ వార్డు సభ్యునిగా గెలిచే సత్తా లేని నారా లోకేష్.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. లోకేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అర్ధరాత్రి పాదయాత్ర చేసే ముద్దపప్పు గురించి ఎక్కువ మాట్లాడి, తన స్థాయిని దిగజార్చుకోవడం ఇష్టం లేదని అన్నారు. సీఎం జగన్‌పై అవాకులు, చెవాకులు, కించపరిచే పదాలు వాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. ఏ అర్హతతో లోకేష్ పాదయాత్ర నిర్వహిస్తున్నాడని ప్రశ్నించారు. ఎన్టీఆర్ మనడు, చంద్రబాబు కొడుకు, బాలకృష్ణ అల్లుడిగా తప్పితే ఆయనకు మరో హోదా లేదన్నారు. ఆయన పాదయాత్ర లక్ష్యం ఏమిటో కూడా తెలియదన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకైతే తమ నేత జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా పాదయాత్ర చేయాలే తప్ప, అర్ధరాత్రి మూడింటికి పాదయాత్ర ఎవరూ చేయరని ఎంపీ భరత్‌రామ్ అన్నారు.

రత్నగిరి.. కిక్కిరిసి..

- భక్తులకు తోడు నవదంపతులు, పెళ్లిబృందాలతో రద్దీ
- 3,500 వ్రతాల నిర్వహణ
- రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధి రెండు రోజులుగా భక్తులతో కిటకిటలాడుతోంది. సామాన్య భక్తులకు నవదంపతులు, వారి బంధుమిత్రులు కూడా తోడవడంతో సోమవారం కూడా రద్దీ కొనసాగింది. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు వంద వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులతో పాటు వచ్చిన పెళ్లిబృందాలు, ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు రత్నగిరికి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడయ్యారు. దీంతో సత్యదేవుని సన్నిధిలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. స్వామివారి ఆలయం, వ్రత మంటపాలు, క్యూలు, విశ్రాంతి మంటపాలు భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట చొప్పున సమయం పట్టింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవదంపతులు, భక్తులు

శిఖర దర్శనానికి పోటెత్తిన భక్తులు

సత్యదేవుని శిఖర దర్శనానికి కూడా భక్తులు పోటెత్తారు. ఆలయ శిఖరం దర్శించేలా యంత్రాలయం వెలుపల అధికారులు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రధానాలయ శిఖరాన్ని దర్శిస్తున్నారు. దీంతో అక్కడ కూడా రద్దీ ఏర్పడుతోంది. ఇక్కడి నుంచి శిఖరం దర్శించేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పెయింట్‌తో చదరపు గడిని ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఏర్పాటు చేశారు. సత్యదేవుని సన్నిధికి వచ్చిన భక్తులు అక్కడి నుంచి శిఖర దర్శనం చేసుకుంటున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి మంత్రి రాజా ఆర్థిక సహాయం



లోవరాజు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

తుని: ప్రజల కష్టాలను తెలుసుకుని వారికి అండగా నిలవడం రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు అలవాటని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతున్న ఉప్పరాపల్లి లోవరాజు కుటుంబ సభ్యులకు మంత్రి దాడిశెట్టి రాజా సమకూర్చిన రూ.రెండు లక్షలు, బాలు, కౌన్సిలర్ అల్లా దివాణం ఇచ్చిన రూ.2 లక్షలు కలిపి రూ.4 లక్షలను సోమవారం తుని మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. 17వ వార్డుకు చెందిన లోవరాజు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. మన మున్సిపాలిటీ, మన బాధ్యత కార్యక్రమంలో సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని బాలు మంత్రి రాజా దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులను కూడా అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, వెంకటేశ్వరస్వామి ఆలయ అధ్యక్షుడు అన్నవరం శ్రీను, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

13 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్ బియ్యం

రాజానగరం: ముందుగా అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీలో రాజానగరంలో 13 టన్నుల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పట్టుకున్నారు. దీని విలువ రూ.11.70 లక్షలు ఉంటుందని అంచనా. ఇందుకు సంబంధించి రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ సోమవారం ఇక్కడ విలేకరులకు తెలిపిన వివరాలిలావున్నాయి. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కొంతమంది స్వార్థపరులు అక్రమంగా రవాణా చేస్తూ, సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ విధంగా వ్యాన్‌లో అనధికారికంగా తరలిస్తున్న 13,000 కిలోల రేషన్ బియ్యాన్ని రాజానగరంలో కరుణశ్రీ హోటల్‌కి సమీపంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్‌లెస్లై అధికారులు పట్టుకున్నారు. కొవ్వూరుకు చెందిన వ్యాన్ డ్రైవర్ కొత్త నరేష్ కొయ్యలగూడెం నుంచి సామర్లకోటకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడు. కొయ్యలగూడెం సమీపంలో షేక్ మీరవల్లి అనే వ్యక్తి ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి చౌకగా కొనుగోలు చేస్తుంటాడు. నరేష్ సాయంతో ఆ బియ్యాన్ని సామర్లకోటకు తరలిస్తుంటారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.11,70,000 ఉంటుందన్నారు. రాజానగరం ఎంఎస్ఓ బియ్యంతో ఉన్న వ్యాన్‌ని సీజ్ చేసి, సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేశారు. నిందితులిద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయమని పోలీసులకు సిఫారసు చేశామని రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ తెలిపారు. ఈ తనిఖీలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుళ్లు వలీ, వీరబాబు, రెవెన్యూ, సివిల్ సప్‌లైయ్ అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం దుర్భరం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈబీ ఏఎస్పీ ప్రేమ్ కాజోల్

- ఎస్ఈబీ ఏఎస్పీ ప్రేమ్‌కాజోల్
- జేఎన్‌టీయూకేలో అవగాహన

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం, వాటి దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ డాక్టర్ పి.ప్రేమ్‌కాజోల్ హాజరై డ్రగ్ అడిక్షన్ అనేది దేశంలో తీవ్ర అందోళన కలిగిస్తున్న అంశమని, మాదక ద్రవ్యాలు విద్యార్థుల జీవితాలను ఎలా నాశనం చేస్తున్నాయో వివరించారు. డ్రగ్స్.. వాడే వ్యక్తిపై మాత్రమే కాకుండా అతని కుటుంబం, సమాజంపై ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతాయని చెప్పారు. యువత మాదక ద్రవ్యాల మత్తులో తమ విలువైన సమయాన్ని ఏ విధంగా వృథా చేసుకుంటోందో చెప్పడంతో పాటు విద్యార్థుల కలలు సాకారం చేసుకోవడానికి వాటికి దూరంగా ఉండాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల శాఖ ఏడీ శ్రీరామ్‌కుమార్, సైకియాట్రిస్ట్ డాక్టర్ కాటన్, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, మీరా సాహెబ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీసు పహారా

అమలాపురం టౌన్: ఈదరపల్లిలో రౌడీషీటర్ హత్య, అతని స్నేహితుడిపై హత్యాయత్నం కేసుల నేపథ్యంలో అమలాపురం పట్టణంలో అనివార్యమైన పోలీసు పహారా సోమవారం కూడా కొనసాగింది. 400 మంది పోలీసులతో, 15 పోలీసు పికెట్లతో బందోబస్తు సాగుతోంది. శాంతి భద్రతల పరిరక్షణకు అమలాపురం వచ్చి ఇక్కడే మూడు రోజులపాటు మకాం ఉండి పరిస్థితిని సమీక్షించిన రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ ఆదివారం సాయంత్రం ఏలూరుకు బయలుదేరి వెళ్లారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం కూడా రౌడీషీటర్ హత్య తదనంతర పరిణామాలపై డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సమీక్షించారు. హత్య, హత్యాయత్నానికి పాల్పడ్డ నలుగురు ప్రధాన నిందితులు, ఇతర అనుమానితుల కోసం తొమ్మిది పోలీసు బృందాలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అన్వేషిస్తున్నాయి. అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న దాదాపు 52 మంది రౌడీ షీటర్లను బ్యాచ్‌లుగా పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్‌లు, వార్నింగ్‌లు ఇస్తున్నారు. రౌడీ షీటర్లకు చెందిన కుటుంబాలు పోలీసు పిలుపులతో వణికిపోతున్నాయి. తమ ఇంట్లో రౌడీ షీటర్ ముద్రవేసుకుని కుటుంబాన్ని వీధికి లాగుతున్న తమ కొడుకుల తీరుపై ఆ కుటుంబీకులు మథనపడుతున్నారు.

పోలీసునని బెదిరించి సొమ్ము కాజేసిన వ్యక్తి అరెస్టు

గండేపల్లి: పోలీసునని బెదిరించి ప్రయాణికుల వద్ద సొమ్ము కాజేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని యల్లమిల్లికి చెందిన పుట్టా వీరభద్రరావు గత నెల 24న తాళ్లూరు నుంచి యల్లమిల్లి వెళుతుండగా మార్గ మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి తాను పోలీస్‌నని తనమాట వినకపోతే ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించి వీరభద్రరావు నుంచి రూ.10,000 నగదు, వెండి ఉంగరం తీసుకుపోయాడు. అదే రోజు మురారిలో రామయ్యపాలెంకు చెందిన అక్కిరెడ్డి వంశీని బెదిరించి అతని వద్ద నుంచి రూ. 5000 నగదు, ఒక సెల్‌ఫోన్ తీసుకుపోయినట్టు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు పిఠాపురం మండలం ఎఫ్‌కె పాలెంకు చెందిన నల్లా శివను సోమవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, మోటార్ సైకిల్, రూ.2,000 నగదును స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టుకు తరలించారు.

జేఎన్‌టీయూకే కార్యనిర్వాహక మండలి తొలి సమావేశం



వర్సిటీ కార్యనిర్వాహక మండలి సభ్యులతో వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ కార్యనిర్వాహక మండలి సభ్యులుగా నియమితులైనవారు సోమవారం వీసీ ప్రసాదరాజును వీసీ సమావేశపు హాల్లో మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్ హోదాలో వీసీ ప్రసాదరాజు అధ్యక్షతన తొలి సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల పరిచయంతో పాటు కొత్తగా చేపట్టబోయే కొత్త అధ్యాపక పోస్టుల భర్తీ తదితర విషయాలపై చర్చించారు. సభ్యులు రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, బెజవాడ వీరవెంకట సత్యనారాయణ(తిమ్మాపురం సర్పంచ్), ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి, సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్, డాక్టర్ ఎస్‌కే అమినాబీ పాల్గొనగా వర్సిటీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని వీసీ ప్రసాదరాజు కోరారు. రాష్ట్రంలో వర్సిటీను అగ్రస్థానంలో నిలపడానికి సమష్టిగా కృషి చేద్దామని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పుల్లో మనం భాగస్వాములం అవుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.హెచ్.ఎం. కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, ప్రొఫెసర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు మోటార్ సైకిల్ ఢీకొని ఇద్దరి మృతి



ఎదుర్లంకలో బైక్ చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన అభిమన్యు

ఐ.పోలవరం: ప్రమాదవశాత్తూ చెట్టుకు మోటార్ సైకిల్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుత్తినదీవి పంచాయతీ పరిధి కరవాకలంకలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిమన్యు(35) ప్రమోద్(28) పనిచేస్తున్నారు. వీరిద్దరూ సోమవారం మోటారు సైకిల్‌పై యానాం వెళ్లారు. యానాం నుంచి తాము పనిచేసే కంపెనీకి తిరిగి వస్తుండగా ఎదుర్లంక భవానిపేట వద్ద కొబ్బరి చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అభిమన్యు అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమోద్‌ను యానాం జీజీహెచ్‌కు తరలించగా అతడు కూడా మృతి చెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఉన్న మృతుల తల్లిదండ్రులకు సమాచారం అందజేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

వలంటీరుపై జనసేన కార్యకర్తల దాడి

కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు, కేసు నమోదు



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వలంటీరు షేక్ యాకూబ్

కాజులూరు: మండల కేంద్రమైన కాజులూరులో ఒక వలంటీరుపై స్థానిక జనసేన కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో వలంటీరు తీవ్ర గాయలపాలై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా బాధితుని ఫిర్యాదు మేరకు సోమవారం గొల్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోనికి వెళ్లితే కాజులూరు శివారు శ్రీరామ్‌నగర్‌లో 15వ క్లస్టర్‌కు చెందిన వలంటీరు షేక్ యాకూబ్ స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద కూర్చుని ఉన్నారు. స్థానిక జనసేన కార్యకర్తలైన తలాటం రాజు, తలాటం రాంబాబు, చీకట్ల శివ మద్యం సేవించి వలంటీరు షేక్ యాకుబ్ వద్దకు వచ్చి వారి ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేయించమని అడిగారు. గ్రామ సచివాలయంలో ప్రస్తుతం ఆధార్ అప్‌డేట్ చేయడంలేదని, మీ సేవా కేంద్రానికి వెళ్లి చేయించుకోవాలని వలంటీరు సూచించాడు. దీంతో వారు ఆగ్రహానికి గురై ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయించలేనప్పుడు నువ్వు వలంటీరుగా పని చెయ్యటం ఎందుకు అంటూ ప్రభుత్వాన్ని, వలంటీరు వ్యవస్థను తీవ్ర పదజాలంతో దూషించారు. వలంటీరు షేక్ యాకూబ్ ప్రతిఘటించటంతో జనసేన కార్యకర్తలు అతనిపై దాడికి దిగి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న యాకూబ్ తల్లితండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్సులో అతనిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రత్నగిరిపై రేపు జన్మాష్టమి వేడుకలు

- 108 మంది చిన్నపిల్లలకు శ్రీకృష్ణుని వేషం
- ఈఓ చంద్రశేఖర్ అజాద్



రత్నగిరి శ్రీగోకులంలో శ్రీకృష్ణుడు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సత్యదేవుడు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, గోపూజ మహోత్సవం, ఉట్లోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 108 చిన్నపిల్లలకు శ్రీకృష్ణుని వేషం వేయించనున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ఊరేగింపుగా కళావేదిక వద్దకు తీసుకువచ్చి అక్కడ వెండి సింహాసనంపై ప్రతిష్ఠించి పండితులు పూజలు చేస్తారు. అనంతరం పండితులు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర పూజ, శ్రీకృష్ణుడికి సహస్రనామ పూజ నిర్వహిస్తారు. తరువాత పండితుల మంత్రోచ్ఛటన మధ్య దేవస్థానం అధికారులు, భక్తులు ఘనంగా గోపూజ నిర్వహిస్తారు. పూజ అనంతరం గోవుల చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసి వాటికి బియ్యం బెల్లం తినిపించిన తరువాత గోమాతలకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పిస్తారని తెలిపారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవార్లకు వేదపండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. గ్రామంలోని ఐదేళ్లలోపు చిన్నపిల్లలను మధ్యాహ్నం 12 గంటలకు కొండమీదకు తీసుకువస్తే వారికి శ్రీకృష్ణుని వేషం వేయించి పూజలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఇందుకు గాను పిల్లనగ్రోవి, నెమలి ఈక, చిన్న పంచె తీసుకుని రావాలి. మేకప్ దేవస్థానంలోనే వేయిస్తారని ఈఓ తెలిపారు. రాత్రి ఎనిమిది గంటలకు రత్నగిరి రామాలయం వద్ద, అనంతరం కొండ దిగువన తొలిపాంచా వద్ద సత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ఉట్లోత్సవం నిర్వహిస్తారు. తదుపరి ఆంధ్రాబ్యాంక్ వద్ద, ఈరంకి వారి వీధిలో కూడా ఉట్లోత్సవం నిర్వహిస్తారని తెలిపారు.

మరదలును హత్య చేసిన బావకు జీవిత ఖైదు

కాకినాడ లీగల్: మరదలును కర్రతో కొట్టి హత్య చేసిన బావ పాలినాటి శ్రీనివాస్‌కు జీవిత ఖైదు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తాళ్ళరేవు మండలం పటవల గ్రామంలోని రామాలయం వీధికి చెందిన పాలినాటి శ్రీనివాస్ ఇంటి పక్కన నివసిస్తున్న తమ్ముడి భార్య పాలినాటి మాధవి ఇంటి ముందు రోడ్డుపై గిన్నెలు కడగడంతో ఇద్దరు మధ్య 2018లో ఘర్షణ వచ్చింది. దీంతో ఇంటి ముందు గిన్నెలు కడగవద్దని ఎన్నిసార్లు చెప్పినా, వినడం లేదని కోపంతో కర్రతో గిన్నెలు కడుగుతున్న మరదలు మాధవి తల వెనుక భాగంలో బలంగా శ్రీనివాస్ కొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై మృతురాలి భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరింగి పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో పాలినాటి శ్రీనివాస్ పై నేరం రుజువుకావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

వర్సిటీ అభివృద్ధికి సమష్టి కృషి

'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు



వీసీ ఆచార్య పద్మరాజు అధ్యక్షతన సమావేశమైన నూతన పాలక మండలి సభ్యులు

రాజానగరం: తెలుగు రాష్ట్రాలలో పెద్ద యూనివర్సిటీగా ఉన్న ఆదికవి నన్నయ యూనివర్సిటీని ప్రగతి పథంలో నడిపించడానికి సమష్టి కృషి అవసరమని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. నూతనంగా ఏర్పడిన పాలకమండలి సభ్యులు వీసీ అధ్యక్షతన సోమవారం తొలి సమావేశాన్ని నిర్వహించారు. యూనివర్సిటీలో విద్య, పరిపాలన తదితర అంశాలు, కొత్తగా మంజూరైన అధ్యాపక పోస్టుల భర్తీలో రేషనలైజేషన్‌ల పై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి ఆన్‌లైన్‌లో సమావేశంలో పాల్గొని, నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో ఆయా రంగాలకు చెందిన సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, పాలక మండలి సభ్యులు ఆచార్య పి.సురేష్‌వర్మ, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ కె.జ్యోతి, డాక్టర్ కె.నూకరత్నం, వసంతలక్ష్మి, షేక్ సులేమాన్, గంధం నారాయణరావు, రాజ్‌కుమార్, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

పిడుగు పడి మహిళ మృతి



రౌతులపూడిలో పిడుగుపడి మృతి చెందిన సత్యవతి

రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడిలో సోమవారం పిడుగు పడి ఓ మహిళ మృతి చెందింది. పొలంలో వరి నాట్లు వేస్తుండగా ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో అక్కడ పని చేస్తున్న గంపా సత్యవతి (26) తీవ్రంగా గాయపడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త తాతబాబు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి

సామర్లకోట: మండల పరిధిలో మాధవపట్నం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలికపై అదే గ్రామానికి చెందిన బరికి వెంకన్న అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లి సోమవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి 8 నెలల జైలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలంలో ఈ ఏడాది మార్చి 14న జరిగిన దొంగతనం కేసులో ఇద్దరికి 8 నెలల జైలు శిక్ష విధించినట్టు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ తెలిపారు. గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనుకు చెందిన షాపులో షట్టర్ తాళాలు పగులగొట్టి రూ. 2,50,000 నగదు అపహరించారు. సీసీ పుటేజీ సహకారంతో బొడ్డు జయబాబు, నామాల చంటిబాబులు ఆ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. నేరం రుజువు కావడంతో రామచంద్రపురం జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరావు నాయక్ వారికి శిక్షను విధించినట్లు తెలిపారు. ఏపీపీ బి. రామతులసి కేసు వాదించారన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న దిశ పోలీసులు




బాలిక బంధువులతో మాట్లాడుతున్న అధికారులు

నల్లజర్ల: బాల్యవివాహాలను అరికట్టడంలో దిశ యాప్ కీలకపాత్ర పోషిస్తోంది. ఇంతవరకు 40కిపైగా బాల్య వివాహాలను జరగకుండా నిలుపుదల చేశారు. తాజాగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పుల్లలపాడు గ్రామంలో బాలిక వివాహం జరగకుండా దిశ పోలీసులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థినికి ఈ నెల 6న వివాహం చేస్తున్నట్టు గ్రామ మహిళా సంరక్షణాధికారి ఇందిరా ప్రియదర్శినికి సమాచారం అందింది. ఈ విషయం రాజమహేంద్రవరంలోని దిశ పోలీసులకు ఆమె సమాచారం అందించారు. దిశ పోలీసులు తమతో పాటు ఐసీడీఎస్ అధికారులను తమ వెంట తీసుకొని ఆ బాలిక ఇంటికి వెళ్లారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను ఆ బాలిక తల్లిదండ్రులకు, పెద్దలకు వివరించారు. బాలిక వివాహాన్ని నిలుపుదల చేయాలని సూచించారు. అందుకు వారు సమ్మతించారు. ఈ విషయాన్ని లిఖిత పూర్వకంగా దిశ, ఐసీడీఎస్ అధికారులకు అందజేశారు. ఆ బాలిక చదువు కొనసాగించాలని అధికారులు సూచించారు. తమకు సమాచారం అందించిన మహిళా సంరక్షణ అధికారి ఇందిర ప్రియదర్శినిని అధికారులు అభినందించారు. ఎక్కడ బాల్య వివాహాలు జరిగినా దిశ యాప్‌కు సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

30 వీఐపీ, పీజీహెచ్ సత్రాల కూల్చివేతకు రంగం సిద్ధం



30 వీఐపీ సత్రం



పీజీహెచ్ సత్రం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల 30 వీఐపీ సత్రం, మెయిన్ క్యాంటీన్ ముందు గల పీజీహెచ్ గెస్ట్‌హౌస్ కూల్చివేయడానికి రంగం సిద్ధమైంది. పీజీహెచ్ గెస్ట్‌హౌస్‌లో తలుపులు, కిటికీలు తొలిగించే పని సోమవారం ప్రారంభించారు. కాగా, 30 వీఐపీ సత్రంలో 60 గదులలో మంచాలు, పరుపులు కూడా స్టోర్‌కు తరలించారు. సత్రంలో గదులకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఒకటి రెండు రోజులలో 30 వీఐపీ సత్రం కూడా కూల్చివేస్తారని అధికారులు తెలిపారు. ఈ సత్రంలో వ్యాపారులకు పశ్చిమ రాజగోపురం పక్కన గల ఖాళీ ప్రదేశంలో షాపులు కట్టించి ఇవ్వనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఈ సత్రాలు కూల్చివేసిన స్థలంలో భక్తుల కోసం అన్ని వసతులతో విశ్రాంతి షెడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఈ సత్రాలు రెండు శిథిలావస్థకు చేరినందున కూల్చివేస్తున్నామని వివరించారు.

కేసుల పరిష్కారంపై సూచనలు

విజిలెన్స్, ఎక్సైజ్ అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లాల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎక్సైజ్ పోలీసులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సోమవారం సమావేశమయ్యారు. జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో జరిగిన ఈ సమావేశంలో అధికారులతో పలు అంశాలను ఆమె చర్చించారు. నాలుగు జిల్లాలలో పెండింగ్‌లో ఉన్న ఎక్సైజ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎస్ఈబీ, ఎక్సైజ్ కేసులను ఇటీవల ప్రవేశపెట్టిన నూతన జీవోల ప్రకారం అధిక మొత్తంలో పరిష్కారం చేసేందుకు వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, తూర్పు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ పి.సోమశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హోండా 'ఎలివేట్' విడుదల



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న డాక్టర్ భాస్కరరావు

రాజమహేంద్రవరం రూరల్: కార్ల దిగ్గజం హోండా తన ఎస్‌యూవీ మార్కెట్‌ను సుస్థిర పరచుకోవడానికి అధునాతన ఎలివేట్ కారును రాజమహేంద్రవరం ఎలైట్ హోండా షోరూంలో సోమవారం ప్రారంభించింది. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల అధినేత డాక్టర్ గన్నిభాస్కరరావు చేతులమీదుగా కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఎలైట్ హోండా సీఈవో శ్రీనివాసరాజు, ఏజీఎం సేల్స్ నరేంద్ర, సర్వీస్ ఏజీఎం ఆలీ, నగర ప్రముఖులు, ఎలైట్ హోండా టీం సభ్యులు పాల్గొన్నారు. ఏజీఎం సేల్స్ నరేంద్ర మాట్లాడుతూ ఎలివేట్ కారులో సరికొత్త హోండాసెన్సింగ్(ఆదాస్ లెవెల్-2) వంటి అధునాతన ఫీచర్, ఫ్రంట్ ఎల్ఈడీ హెడ్‌లైట్‌ను, స్మార్ట్ ఎలక్ట్రిక్‌సన్‌రూఫ్, హోండా కనెక్ట్‌వాయిస్ కమెండ్స్ విత్ ఆలెక్స, గూగుల్‌వాయిస్ కమాండ్స్ 65ప్లస్ ఫీచర్స్ ఉన్నాయన్నారు. మొత్తం ఏడు సరికొత్త ఆకర్షణీయమైన రంగులలో లభ్యమవుతుందన్నారు. ఈ కారు ధర రూ.10,99,000 లక్షలు అని తెలిపారు.